క్లుప్తంగా

25న నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం

బనగానపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఈ నెల 25న బనగానపల్లె నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తన అధ్యక్షతన జరిగే సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జీలానీ సామూన్ హాజరవుతారన్నారు. జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు, ఎంపీపీ, జెడ్పీటీసీ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొనే సమావేశంలో నియోజకవర్గంలో జరిగిన, చేయాల్సిన అభివృద్ధిపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కోవెలకుంట్ల: ప్రభుత్వ బ్యాంకులతో దీటుగా ఆర్‌బీఐతో గుర్తింపు పొందిన కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని ఆ బ్యాంకు అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాసరావు సూచించారు. శనివారం బ్యాంకు 56వ మహాజన సభ నిర్వహించారు. ముందుగా బ్యాంకు వ్యవస్థాపకుడు సముద్రాల వెంకట నారాయణశెట్టి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు ఆర్జించిన ఆదాయం, లావాదేవీలకు సంబంధించిన నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ, పాలకవర్గ సభ్యులు సురేంద్రగుప్త, మురళీకృష్ణ, కాల్వ నాగేశ్వరరావు, వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం బాబు, మాధవ నరసింహులు, చంద్రశేఖర్, రాజా పెద్దతిరుపతయ్య, కర్నాటి సుబ్రహ్మణ్యం, ఇస్కాల ప్రసాద్ పాల్గొన్నారు.

కంపోస్టు యార్డు పరిశీలన



యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

డోన్ : పట్టణ శివారులోని కంపోస్టు యార్డును శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మేనేజర్ రాజు, ఏఈ సురేష్ కంపోస్టు యార్డును పరిశీలించారు. కంపోస్టు యార్డు నుంచి లెగసీ వేస్ట్‌ని ట్రీట్ చేసేందుకు స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా ఆకాంక్ష ఎంటర్‌ప్రైజెస్‌తో అగ్రిమెంట్ కుదిరిందని, త్వరలో ప్రాజెక్టును ప్రారంభిస్తామని కమిషనర్ తెలిపారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు

బనగానపల్లెరూరల్: బనగానపల్లె తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గోస్పాడు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును రెవెన్యూ సిబ్బంది, వివిధ ప్రజాసంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

బనగానపల్లెరూరల్: వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని వైద్య సిబ్బందితో కలిసి ఆయన సందర్శించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు ప్రతి రోజు వ్యాయామం చేయాలని సూచించారు. హెల్త్ సూపర్ వైజర్ నల్లగట్ల వెంకటేశ్వర్లు,వార్డెన్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

24న ఖాళీ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

డోన్ టౌన్ : పట్టణ శివార్లలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల్లో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంటర్ అడ్మిషన్లకు 24వ తేదీ సోమవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ గీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఎంపీసీలో ఎస్సీ–2, ఓసీ–1, బైపీసీలో ఎస్సీ–2, ఎస్టీ–2 సీట్లు ఖాళీ ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 24న ఉదయం 10గంటలకు హాజరు కావాలన్నారు.

దుస్తుల పంపిణీ

డోన్ టౌన్ : పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల బీసీ బాలికల విద్యాలయంలో వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి శారద, జగన్‌మోహన్ దంపతుల ఆర్థిక సాయంతో రూ.20వేల దుస్తులు పంపిణీ చేశారు. దాతల కొడుకు, కోడలు జ్యోత్స్న, గురుదీప్ కుతూరు జోయ ఉష జన్మదినం పురస్కరించుకుని సమితి కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి, సభ్యులు తోగట సురేష్, విజయభట్టు చేతుల మీదుగా విద్యార్థినులకు దుస్తులు అందజేశారు.



మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు



మహిళకు ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న దృశ్యం



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న అధికారులు, నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

డోన్ : సాంకేతిక, ఇతర కారణాల మూలంగా మిగిలిపోయిన ప్రతి పేదకు సంక్షేమ పథకాలు అందజేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గోసానిపల్లె, కొచ్చెర్వు, చింతలపేట గ్రామాలలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హులైన 99 శాతం మందికి రాష్ట్రంలో సంక్షేమ పథకాల ఫలాలను అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మిగిలిన ఒక్క శాతం అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలనే దృఢసంకల్పంతో అందుకు కావాల్సిన ఆధారాలను అందజేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, కొచ్చెర్వు, చింతలపేట, గోసానిపల్లె సర్పంచ్‌లు మంజుల, సూర్యచంద్రుడు, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న శ్రీరాములు, రాజశేఖర్‌రెడ్డి

ప్రజల ముంగిటికే ప్రభుత్వ సేవలు

బేతంచెర్ల: గ్రామ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేయడానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు జయ ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎం.పేండేకల్లు గ్రామంలో సర్పంచ్ ముచ్చు రామక్క, ఎంపీటీసీ మహేశ్వరమ్మ, ఎంపీడీఓ వెంగన్న, సీతారామాపురం గ్రామంలో సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ సుబ్బమ్మ, శంకలాపురం సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో అధికారులతో కలిసి వారు లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ ఆర్డీ ఈశ్వరన్న, డీటీ సత్యదీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, గూని నాగరాజు, తిరుమలేశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, పరమేష్, మహేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న, గోరుమానుకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కొండమనాయునిపల్లెలో మహిలకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి



లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్



మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న గుండం నాగేశ్వరరెడ్డి, శివరామయ్య

పేదలకు జగనన్న సురక్ష వరం

అవుకు: జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండమనాయునిపల్లెలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ చల్లా మాట్లాడుతూ అర్హత ఉన్న ఏ ఒక్క పేద సంక్షేమ పథకాలు అందకుండా మిగిలిపోకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లుతో కలిసి ఎంపీపీ లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అదేవిధంగా అవుకు–1 గ్రామ సచివాలయంలో సర్పంచ్ మందా గుర్రమ్మ, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులుతో కలిసి వారు ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, ఏపీఓ అనీఫా, ఏపీఎం విజయగోపాల్, ఈఓ అశ్విన్ కుమార్, వైస్ ఎంపీపీ రామప్ప, ఎంపీటీసీ సోమ్లా నాయక్, సర్పంచ్‌లు శివరామ భూపాల్ రెడ్డి, సుబ్బమ్మ, నాయకులు శ్రీనివాస రెడ్డి, నారాయణ రెడ్డి , భాస్కర్ రెడ్డి, శివారెడ్డి,శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని గిద్దలూర్‌లో శనివారం ఎంపీడీఓ నాగకుమార్, డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్, జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మి ఉసేనమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు గిద్దలూరు బత్తుల రామచంద్రరెడ్డి, మిక్కినాయినపల్లె దేశాయి రెడ్డి, మంగపల్లె మధుసూదన్ రెడ్డితో కలిసి లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మొత్తం 252 సర్టిఫికెట్లు అందజేశామని డీటీ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సాఆర్‌సీపీ నాయకులు శివరామి రెడ్డి, రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతుందని తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ అన్నారు. శనివారం తిమ్మనాయినపేట, తోళ్లమడుగు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డితో కలిసి తహసీల్దార్ లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రేవనూరు హుశేన్‌బి, మొలక రాజారెడ్డి, లక్ష్మిదేవి, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు, నందవరం సచివాలయాల్లో శనివారం అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన పలుకూరులో జరిగిన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఎంపీడీఓ శివరామయ్య, సర్పంచ్ సుమలతో కలిసి గుండం నాగేశ్వరరెడ్డి ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. 1,014 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశామని ఎంపీడీఓ తెలిపారు. నందవరం గ్రామ సచివాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. 741 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పీఆర్ వెంకటేశ్వరరెడ్డి, తులసీశ్వరరెడ్డి, సర్పంచ్ ఖైరూన్‌బీ చేతుల మీదుగా తహసీల్దార్ ఉచితంగా అందజేశారు. ఈఓ శ్రీనివాసు లు, ఉపసర్పంచ్ శివకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలుడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

కోవెలకుంట్ల: అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 4వ గ్రామ సచివాలయ ఆవరణలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, తదితరులు హాజరయ్యారు. తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ రాధిక ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు వర్తించని లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. అనంతరం ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ గోపీనాథ్, పశువైద్యాధికారి కృష్ణకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, ఏపీఎం గురుస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, ఎంఎల్‌ఓ రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓర్వలేకనే టీడీపీ నాయకుల అసత్య ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : డోన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఓర్వలేకనే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి పచ్చ మీడియా సహకారంతో అసత్య ప్రచారానికి పూనుకుంటున్నారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, రైల్వే నాగేంద్ర ఆరోపించారు. స్థానిక బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రూ.2కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియం నీళ్లపాలని అసత్య ప్రచారం చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా సింథటిక్ కోర్టు, ప్రేక్షకుల గ్యాలరీలతో నిర్మించిన ఇండోర్ స్టేడియం ఎంతో ఆధునికమైందన్నారు. కూరగాయల మార్కెట్ భవనాలను అత్యంత ఆధునిక వసతులతో నిర్మిస్తున్నామన్నారు. గత నెలలో కురిసిన వర్షాల మూలంగా జలమయమైన వైఎస్ నగర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో టీడీపీ నాయకులు పర్యటించిన సందర్భంగా వారంలోపు వర్షపునీటి నిల్వలను మున్సిపల్ అధికారులు తొలగించకుంటే సొంత నిధులతో సీసీ రోడ్లు వేస్తానని పలికిన ప్రగల్భాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నెల కావస్తున్నా ధర్మవరం సుబ్బారెడ్డి గంపెడు మట్టి కూడా పోయలేదని ఎద్దేవా చేసిన ఆయన ఇప్పటికైనా ప్రజలను మభ్యపెట్టే చర్యలు మానుకోవాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సతీష్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఇసుక ట్రాక్టర్ సీజ్

డోన్ టౌన్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు శనివారం సీజ్ చేసి పట్టణ పోలీసులకు అప్పగించారు. కృష్ణగిరి మండలం కొయిలకొండ గ్రామ పరిసరాల్లోని వంకల నుంచి ఇసుక లోడుతో పట్టణంలోనికి వస్తుండగా జాతీయ రహదారి కంభాలపాడు సర్కిల్ వద్ద సెబ్ పోలీసులు తనిఖీ చేశారు. ఏలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమాని కాకి భాస్కర్, డ్రైవర్ రఘురాముడుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు

డోన్ టౌన్ : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర గోదాదేవి సహిత ఆలయంలో శనివారం అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి అమ్మవారి తిరు నక్షత్రాన్ని పురస్కరించుకొని పుష్పాలంకరణ, తిరుప్పావై పారాయణం, సువర్ణ పుష్పార్చన, తనింహారతి, మహా మంగళ హారతి ఇచ్చారు. భక్తులు తిరుప్పావై పఠించి వెంకటేశ్వరస్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

డోన్ టౌన్ : ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన పితావత్ రమేష్ నాయక్(27) కర్నూలు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. బనగానపల్లె మండలం చిన్నరాజుపాలెం తండాకు చెందిన మృతుడు కొద్ది రోజులుగా అదే గ్రామానికి చెందిన వేరే మహిళతో కలిసి పట్టణంలోని తారకరామనగర్‌లో సహజీవనం చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఈ నెల 19న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన సహచర మహిళ చికిత్సల నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సన్మానం

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం ఉన్నత పాఠశాలలో గతేడాది పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను స్థానిక పాఠశాలలో హుసేనాపురం ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (హోసా) సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎస్తేరు రాణి, మానస, తేజస్వినిని వెండి మెడల్స్‌తో సత్కరించారు. కార్యక్రమంలో హోసా అధ్యక్షుడు సుదర్శన్, న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, హోసా సభ్యులు నబిరసూల్, శ్రీనివాసరాజు, శ్రీనివాస రెడ్డి, శివశంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీల్లో నాటుసారా విక్రయిస్తున్న మండ్ల దామోదరమ్మను అదుపులోకి తీసుకొని 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ లింగమయ్య శనివారం తెలిపారు. ఆమెను డోన్ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

డోన్ టౌన్ : పట్టణంలోని ప్రధాన కూడళ్లతోపాటు రహదారులపై ట్రాఫిక్ నియంత్రణ కోసం వాహనదారులు, పాదాచారులు సహకరించాలని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం పట్టణంలోని పాతబస్టాండ్‌తో పాటు రద్దీ కూడళ్లలో ఆయన పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. ట్రాఫిక్, రద్దీ ప్రాంతాల్లో పోలీసుల పహారా, గస్తీలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ కొనసాగించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఎస్ఐకు సూచించారు.

మహిళలకు రక్షణ కరువు

డోన్ టౌన్ : దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు అక్కడి బీజేపీ ప్రభుత్వ వైఫల్యం కారణమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఆరోపించారు. మణిపూర్‌లో మహిళలపై జరిగిన దాడులు, అత్యాచారాలు, హత్యలకు నిరసనగా శనివారం వేర్వేరుగా పట్టణంలో నిరసన తెలిపారు. పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి సీఎం నరేంద్ర మోడీ, మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఇప్పటికైనా నైతిక బాధ్యతగా పీఎం మోడీ, మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ వెంటనే రాజీనామా చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

అజ్ఞాతంలోకి నగల వ్యాపారి

డోన్ టౌన్ : పట్టణంలోని పాతపేటకు చెందిన గోల్డ్ స్మిత్ కొద్ది రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లాడు. దీంతో నగలు చేయించుకునేందుకు ఆర్డర్లు ఇచ్చిన బాధితులు శనివారం రాత్రి పట్టణ పోలీసులను ఆశ్రయించారు. నిందితుడు పట్టణంలోని పెద్ద బజారులో ఉన్న ప్రభుత్వ హైస్కూల్ సమీపంలో జ్యూవలరీ షాప్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇందులో వెంకటనాయునిపల్లెకి చెందిన మరో వ్యక్తి ఉన్నట్లు తెలిసింది. వీరికి తారకరామగనర్‌కు చెందిన ఒక వ్యక్తి దాదాపు 8.5తులాల బంగారు నగలకు ఆర్డరు ఇచ్చి నగదు చెల్లించగా చిగురమానుపేటకు చెందిన మరో మహిళ నగల కోసం ఆర్డరు ఇచ్చినట్లు పట్టణ పోలీసులకు రాత్రి ఫిర్యాదు అందింది. వీరితో పాటు మరికొంత మంది బంగారం కోసం డబ్బులు ఇచ్చినట్లు సమాచారం. మొత్తం ఎంత మంది ఎంత ఇచ్చారనే విషయం తెలియాల్సి ఉందని, నిందితుడి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

సుద్దముక్కతో చంద్రయాన్ 3 రాకెట్



ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు బండి మధుకృష్ణ సుద్దముక్కతో చంద్రయాన్ 3 ఆకృతిని తయారు చేశాడు. ఇస్రో గత వారం ప్రయోగించిన చంద్రయాన్ విజయవంతం కావడంతో 7 ఇంటూ 3.5 మిల్లీమీటర్ల పొడవు, వెడల్పుతో ఈ ఆకృతిని రూపొందించాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు మధుకృష్ణను అభినందించారు. ఇస్రో భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలు విజయవంతం గా చేయాలని మధుకృష్ణ ఆకాంక్షించాడు.

అనాథ శవానికి అంత్యక్రియలు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లెలో అనాథ వ్యక్తి(50) అనారోగ్యంతో శనివారం మరణించాడు. మృతునికి ఎవ్వరు లేకపోవడంతో గూటుపల్లె గ్రామస్తులు మృతునికి అంత్యక్రియలు నిర్వహించమని ఆ నల్లురు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వన్నూర్ బాషాకు తెలిపారు. బేతంచెర్ల పోలీసులకు సమాచారం ఇచ్చి అనాథ మృతదేహానికి సంస్థ సభ్యు లు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తుడు ముల్లా ఇద్రూస్, సభ్యులు నాగేశ్వర్‌రెడ్డి, రాఘవేంద్ర, సద్దాం, యూసుఫ్, అక్బర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి

కోవెలకుంట్ల: స్థానిక ఎల్ఎం కాంపౌండ్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు చింతలయ్య(75) శనివారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక మృత్యువాత పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల మండలాల్లోని వివిధ గ్రామాల్లో దాదాపు 40 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా ఆయన సేవలందించారు.

నేటి నుంచి గడపగడపకు మన ప్రభుత్వం

సంజామల: మండల పరిధిలోని పేరుసోములలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ చిన్న బాబు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారన్నారు. ఎమ్మెల్యే గడప గడపను సందర్శించి ప్రభుత్వ పాలనను వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబు

- నేడు సచివాలయం, ఆర్బీకే భవనాలు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని





రూ.35లక్షలక్షతో నూతన సచివాలయం భవనం,రూ.21.80 లక్షలతో నూతన రైతుభరోస కేంద్రం భవనం

సంజామల: మండల పరిధిలోని పేరుసోములలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలు ముస్తాబయ్యాయి. రూ.35 లక్షలతో సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం భవనాలు ఒకేచోట నిర్మించారు. ఆధునిక వసతులతో ప్రజలకు అనుగుణంగా రెండు కార్యాలయాలు నిర్మించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం నూతన భవనాలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ చిన్న బాబు తెలిపారు.

అటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

బనగానపల్లెరూరల్: తనపై అసభ్యంగా ప్రవర్తించిన వార్డు జనరల్ డ్యూటీ అటెండెంట్ అరబ్‌జాన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఇల్లూరుకొత్తపేటకు చెందిన దేవి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం బనగానపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఎదుట నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా బాధితురాలు దేవి మాట్లాడుతూ తన కుమారుడు యశ్వంత్‌కు మోషన్స్ (బేదులు) ఎక్కువగా అవుతుండడంతో ఐదు రోజుల క్రితం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించానన్నారు. అయితే శుక్రవారం రాత్రి తనకు పంటినొప్పి అధికం కావడంతో డాక్టర్ గదికి వెళ్లగా లేరన్నారు. అయితే అక్కడే ఉన్న అటెండెంట్ అరబ్ జాన్ తాను చికిత్స చేస్తానని గదిలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. భయందోళనకు గురై బయటికి వచ్చానని, అటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలు ఫిర్యాదు చేశారని, సిబ్బంది, పేషంట్లను విచారిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత తెలిపారు. నిజమని తెలితే ఉన్నతాధికారులకు తెలియజేసి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామానికి చెందిన పేకాటరాయుళ్లను శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. ముగ్గురు వ్యక్తులు గ్రామ శివారులోని ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో దాడి చేశామన్నారు. వారిని అదుపులోకి తీసుకుని రూ. 7,560, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

26న సర్వసభ్య సమావేశం

బేతంచెర్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 26వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులతోపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని సూచించారు.